# అటాక్

వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు. ఓ వల్లని సాయంత్రం డాబామీద కూర్చుని బాతాఖానీ వేస్తున్నారు. పరీక్షలు బాగా దగ్గర కొచ్చాయి. చదువు తున్నావా?'' పవిట భుజం చుట్టూ తిప్పుకుంటూ అడిగింది కవిత.

"ఏం చదువో బాబూ! పుస్తకం ఎత్తుకోగానే నిద్ర ముంచుకొస్తుంది...'' నోటి దగ్గర ఆవలింతలు వేసుకుంటూ నవ్వింది శైలు. శైలు ఓ ఆఫీసర్ కూతురు. కవిత మామూలు బడిపంతులు కూతురు. ఇద్దరి మధ్య చాలా కాలం నుండి చెరగని స్నేహం, కొన్ని విషయాలలో తేడాలున్నా...

"బగా చదివితే ఎం.బి. పంపాలని డాడీ కోరికట...మరి నువ్వు...''

"ఆ...ఎంత చదివినా పెళ్ళి తప్పదుకదా! ఇంటర్‌లో కాకపోయినా డిగ్రీలో వివాహం చేయా లని మా అమ్మగారి కోరిక'' నవ్వుతూ అంది కవిత.

"పెళ్ళి తప్పదంటావా?''

"అంతే కదా! డాక్టరయినా, ఐ.ఎ.ఎస్. ఆఫీస రయినా గృహిణి కావాల్సిందే!''

"అలాగే ఇక దాన్ని గూర్చి స్పీచ్ ఇవ్వకు. దగ్గర్లో తలనొప్పి మందులేవి లేవు. అవునూ నువ్వు ఎవర్ని చేసుకుంటావ్?'' అమాయకంగా అడుగుతున్న శైలు మాటలకు ఫక్కున నవ్వి "నాకేం తెల్సు? మా నాన్నా వాళ్ళు చూసిన వాళ్ళని. నువ్వూ అంతేగా?''

ఒప్పుకున్నట్లుగా తలూపింది శైలు.

"అయితే మనం మ్యారేజ్ అయ్యాక హనీ మూన్ ఏ వూరెడదాం?''

"ఎక్కడికో హోటుకిలే...''

"ఛ...అలా అనకు కవీ! ఇది మనిష్టం కదా! నాకేమో అమెరికా వెళ్ళాలని వుంటుంది. మరి నీకూ...''

"అరకులోయ...''

"అంతేలే! నీ మాటలు అలాగే వుంటాయిగా. లోయల్లోకి, కొండల్లోకి వెళ్ళి కుహూ కుహూ అని పాడుకోండి'' నవ్వింది శైలు.

** ** **

"మరి వాళ్ళిద్దరు ఇప్పుడేం చేస్తున్నట్లో...

శైలు అత్తగారింట్లో ఆరళ్ళు పడలేక, మతి తప్పి పుట్టింట్లోకి చేరిపోయింది. మైగాడ్! మరి కవిత? ఎలాగో కష్టాలకు తట్టుకుని, ఒద్దుకు చేరి యిప్పు డిప్పుడే ప్రశాంతమైన జీవితాన్ని అనుభవించబో తోంది. సో ఇద్దరూ అత్తగార్ల ఆటాక్‌కు గురి అయ్యారన్నమాట.

ఆ నిలవలేక ఒకరు. నిలచి ఒకరున్నారు... అనుకుంటున్నారు యిరుగు పొరుగు వీళ్ళని చూసి.

— డి. కుసుమకుమారి

# ప్రశ్నార్థకం!



రవికి చిన్న వయసులోనే తల్లిదండ్రులు పోయారు.

అతను వారాలు చేసుకుని బతుకుతూ కాయ కష్టం చేసి ఆ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో పాత పుస్తకాలు కొని చదువుకుని ప్రైవేటుగా కట్టి 'ఇంటర్' పాసయ్యాడు.

కాలేజీలో చేరాలని ప్రయత్నించాడు.

అతడిని కొందరు పెద్దలు కూడా ప్రోత్సహించ డంతో అప్లికేషను ఫారాలు తెచ్చి అన్ని కాలేజీలకు దరఖాస్తులు పెట్టుకున్నాడు.

అంత మంచి మార్కులు వచ్చినా ఒక్క కాలేజీ లోనూ సీటు దొరకలేదు. తరవాత కారణం తెలి సింది.

దరఖాస్తు ఫామ్ పూర్తిచేసినప్పుడు అతడికి ఏ కులమో తెలియక- తెలిసినా కుల మతాల పట్టింపు లేని అతడు "కులం'' అన్న దానికెదురుగా "లేదు'' అని రాశాడు.

మరి ఆ మహానగరంలో ప్రభుత్వ కళాశాలలలో వెనుకబడిన జాతులవారికి, కులాలవారికి ప్రాధాన్యం. ప్రైవేట్ కాలేజీలలో- అగ్ర కులాలకి ప్రాధాన్యం. కొన్ని కాలేజీలలో ముస్లింలకి మాత్రమే ప్రాధాన్యం, క్రిస్టియన్స్‌కి మాత్రమే ప్రాధాన్యత నిచ్చేది కొందరు.

అలాగే సిక్కులు... గుజరాతీలు... ఇలా ఒక్కొక్క కులానికి, ఒక్కొక్క మతానికి ప్రాధాన్యం ఇచ్చి వారిని మాత్రమే కాలేజీల్లో తీసుకుంటారని తెలుసుకున్నాడు!

తాను జాతీ, మతం, కులం అన్నిటికీ 'లేదు' అని రాసినందువల్లనే సీటు రాలేదని గ్రహించాడు.

ఆఖరికి ఒకరి సలహాపై మండలాధిపతి ద్వారా తను వెనుకబడిన జాతివాడినని సర్టిఫికెట్ సంపా దించి తీసుకువెళ్ళాడు రవి. వెంటనే ప్రభుత్వ కళాశాలలో సీటు లభించింది.

కుల మత భేదాలు చూపకూడదంటూ ఉపన్యా సాలు ఇచ్చే పెద్దలు- వీటికెందుకు కింద ప్రాధాన్యా న్నిస్తారో అర్థం కాలేదు రవికి.

— ఆర్.ఎస్. హైమవతి

# బ్రహ్మమాయ

వైకుంఠం అంతా అల్లకల్లోలంగా వుంది. అందరూ హడావుడిగా అటూ ఇటూ పరు గులు తీస్తున్నారు. ఎప్పుడు ఏ వార్త విన వలసి వస్తుందోనని మరి కొందరు భయపడు తున్నారు. మొత్తానికి అందరి గుండెల్లోను ఏదో ఒక రకమైన 'భయమే' చోటు చేసు కుంది. తొమ్మిది నెలలుగా ఎదురు చూసిన రోజురానే వచ్చింది.

సమయం దగ్గరపడుతున్న కొద్దీ లక్ష్మీదేవి ముఖం ఆందోళనతో నిండి శరీరం అంతా చిత్తడితో నిండిపోయింది. ఇంద్రుడు కదలక మెదలక స్థాణువులా నిలబడిపోయాడు. గంధర్వులు తాము ఆనందభైరవి పాడాలో, ముఖారి పాడాలోనని ఆ రెండు రాగాలూ సాధన చేస్తున్నారు. కిన్నెర, కింపురుషులు తాము గజ్జెకట్టాలో అక్కరలేదో నిశ్చయించుకోలేక పోతున్నారు. కలహా భోజనుడు వార్తలు చదవడానికై వార్తా సేకరణకి వచ్చాడు.

స్పెషలిస్టులందరూ వచ్చారు. ఎవరి అవసరం ఎప్పుడు వస్తుందోనని వారి వారి ఇన్‌స్ట్రుమెంట్స్‌తో సిద్ధంగా వున్నారు. హార్ట్ స్పెషలిస్ట్ కృత్రిమ గుండె, ఆక్సిజన్ సిలిండర్‌లతో సిద్ధంగా వున్నాడు. ఎనస్థీషియన్ మత్తుమందు ఇంజక్షన్ చేతిలో పట్టుకుని రెప్పవేయక అలాగే నిలబడ్డాడు.

లక్ష్మీదేవి తామిద్దరి మధ్య ఆ విషయం గూర్చి జరిగిన సంభాషణ గుర్తు తెచ్చుకుంటూ ఒక వంక ముసిముసిగా నవ్వుకుంటూ మరో వంక బింకంగా వుంది. ఏమి చేయడానికీ పాలు పోవడం లేదు.

ఇంత జరుగుతున్నా ఏమీ తెలియని విష్ణుమూర్తి మాత్రం ప్రశాంతంగా నిద్ర పోతున్నాడు.



